# ప్రేమలేఖ

ఆ వేళ రెండో శనివారం ....

ప్రభుత్వకార్యాలయాన్నింటికీ సెలవు. అయినా ఆ కార్యాలయం పనిచేస్తోంది. అందుకు కారణం రెండు రోజుల తర్వాత కలెక్టరు ఇన్‌స్పెక్షన్ ఉండటమే!

కొందరు క్లర్కులు పర్సనల్ రిజిష్టర్లని అప్డేట్ చేసుకుంటూంటే... కొందరు ఫైళ్ళకి పాతరేపర్లని తీసివేసి, కొత్త రేపర్లని తొడిగి, దానిమీద నెంబర్లని అందంగారాసి ముస్తాబు చేస్తున్నారు. మరికొందరయితే అటెండర్ల చేత డిస్పోజల్స్‌ని మంచి అట్టలు వేసి భద్రంగా కుట్టించేస్తున్నారు.

చాలా అవసరమైతే తప్ప ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం లేదు వాళ్ళు.

దేశంలోని ప్రతి ఆఫీసూ, ప్రతిరోజూ ఇలాగే పనిచేస్తూ ఉంటే పెండింగ్ వర్కు మచ్చుకైనా కనిపించకపోగా, ఇంకా కొత్త వర్క్ ఎప్పుడొస్తుందా అని ఎదురు చూడాల్సి వస్తుందేమో క్లర్కులు.

శంకరరావు తనటేబుల్ మీద దొంతరులుగా ఫైళ్ళు పేర్చుకుని తన పర్సనల్ రిజిష్టరులో చర్య తీసుకోని ఒక ఫైలు కోసం ఆత్రంగా గాలిస్తున్నాడు. అప్పటికి ఒక పదిసార్లు ఆ ఫైళ్ళు బీరువాలోకీ, టేబుల్‌పైకి మళ్ళీ బీరువాలోకీ, మళ్ళీ టైబుల్‌పైకీ ప్రయాణం చేశాయి. అయినా తప్పిపోయిన ఫైలు జాడ తెలియరాలేదు. ఫైళ్ళుంచిన ప్రతిప్యేడ్‌ని మళ్ళీ నెమ్మదిగా ఒక్కొక్కదాన్నే జాగ్రత్తగా తిరగేసి చూస్తున్నాడు. ఇంట్లో నిత్యం కనిపించే ఎంతో విలువైన సామాను ఒకటి కనిపించకపోతే అంత ఆందోళన ఉండదు గానీ, ఏ మాత్రం ప్రాముఖ్యత లేని ఒక చిన్న ఫైలు కనిపించకపోతే గుమస్తా ఆందోళన ఇంతా అంతా కాదు. అందులోనూ శంకర్రావులాంటి సిన్సియర్ సీనియర్ గుమస్తాల కథ వేరే చెప్పనవసరం లేదు. అందుకే అతనికి అంత ఆందోళన మరి.

శంకరరావు వయసు ముప్పయ్యేళ్ళూ, అతని ప్రభుత్వ సర్వీసుకి పన్నెండేళ్ళూనూ. అంటే - తనపద్దెనిమిదో ఏటో ఉద్యోగంలో చేరేడన్నమాట. ఆ ఆఫీసులోనే సీనియర్ మోస్టు క్లర్కులలో శంకరరావు ఒకడు.

అతను బీరువా చూసి అందులో ఎన్ని ఫైళ్ళుంటాయో లెక్కచెప్పగల నేర్పరి. తన బీరువాలోని అయిదువందల ఫైళ్ళ నెంబర్లన్నీ అతనికి కంఠతా వచ్చును. ఎంతటి క్లిష్టమైన రెఫరెన్సుకైనా అవలీలగా జవాబు రాసేయగల ధీరుడు శంకరరావు. ఇంకా చెప్పాల్సి వస్తే ఆ ఆఫీసులోని ఏ సీటులో పనైనా కళ్ళు మూసుకుని అవలీలగా చేయగల ఘనుడు శంకరరావు.

"సార్! శంకరరావుగారూ! ధర్మవరంది 111/88 నెంబరు ఫైలు మీదేనా ... పొరపాటున నా ఫైళ్ళలో కొచ్చింది" అడిగాడు రామమూర్తి.

శంకరరావు ప్రాణం లేచి వచ్చింది. దిగ్గున తలెత్తి చూశాడు శంకరరావు. "యస్...యస్...రామ్మూర్తీ! మీ దగ్గరికెలా వచ్చిందండీ! రెండుగంటల సేపట్నించి వెతికిన ఫైలు వెతక్కుండా వెదుకుతున్నా.. ఇదిగో ఓబిలేసూ.. రామ్మూర్తి దగ్గర్నించీ ఆ ఫైలు తీసుకురావయ్యా!" అంటూ అటెండరు ఓబిలేసునికి పని పురమాయించాడు.

శంకరరావుకు ఫైలు దొరకడం గొప్ప ఆనందానిచ్చింది...

"కాఫీ తాపాలండోయ్ శంకరావుగారూ! మీ ఫైలు దొరికినందుకు" అన్నాడు రామ్మూర్తి సోడాబుడ్డి కళ్ళద్దాల్లోంచి చూస్తూ.

"అలాగే..దాందేముంది గురూ.. మధ్యాహ్నం భోంచేసి వచ్చాక తాగేద్దాం" అన్నాడు నవ్వుతూ శంకరరావు.

అటెండరు తెచ్చియిచ్చిన ఫైలుని ఆప్యాయంగా అందుకుని, దానిమీద వెంటనే చర్య తీసుకునేందుకు తెల్ల కాగితాన్ని తీసుకుని గబగబ రాయసాగాడు.

"ఇదిగో సార్..మీ టపాలు...టపా గుమస్తా ఇచ్చారు" అంటూ చిన్న సైజు ఉత్తరాల కట్ట నొకదాన్ని ఓబిలేసు తెచ్చి టేబుల్‌మీద వుంచాడు.

'ఈ పాడు టపా గుమస్తాగాడొకడు. తన ప్రాణానికి, చీటికీ మాటికీ 'ఇదో టపా' అంటూ పంపుతాడు - జిడ్డు వెధవ!' అని మనసులో గొణిగి-

"ఏమయ్యా రాజా..మళ్ళీ యివ్వచ్చుగదా ఈ టపాల్ని. దీన్ని పర్సనల్ రిజిష్టరులో ఎంటర్ చేసుకోవడం ఇప్పుడు అయ్యేపనేనా...అందులోనూ అన్నిటికీ నెంబర్లు ఇచ్చావు" అన్నాడు రాజు.

"అది నిన్నటి టపాలు సార్....నేను నిన్న సెలవు పెట్టానుగా అందుకే ఇవాళ ఇచ్చాను" అన్నాడు రాజా.

"సర్లే సర్లే" అంటూనే ఒక్కో ఉత్తరాన్నీ తీసి దాని సబ్జెక్టు మాత్రం చదివి పక్కన పెడుతున్నాడు. సబ్జెక్టులో అతి ముఖ్యం అనిపించినదాన్ని ఉత్తరమంతా పూర్తిగా చదివేసి దాని సారమంతా పిండుకున్నట్లు తల ఆడిస్తున్నాడు శంకరరావు.

"సార్...మీకో లెటర్ వచ్చింది..." అంటూ వచ్చాడు అటెండరు ఆంజనేయులు.

"తీసుకోనయ్యా....దాన్ని సోమవారం తీసుకురా" అంటూ తల ఎత్తకుండానే అన్నాడు శంకరరావు.

"ఇది మీ పర్సనల్ లెటర్ సార్... ఆఫీసుది కాదు" అన్నాడు ఆంజనేయులు.

"అలాగా...అయితే ఇలా ఇయ్యి"

ఆ కవర్ని అందుకుని చూశాడు. అది సాక్షాత్తూ తన ప్రియమైన భార్య ప్రమీల రాసిన ఉత్తరం!

నూటికి నూరుపైసల నిజమైన క్లర్కు తన పర్సనల్ లెటర్స్‌కి ఎంత విలువ యిస్తాడో శంకరరావు కూడా అంతే ఇస్తాడు.

అవును.. అందుకే ఆ కవరు ఆఫీసు టపాల కిందికి వెళ్ళిపోయింది.

తన పర్సనల్ రిజిష్టర్లో ఆ టపాల్నంతా నమోదు చేసుకున్నాక అడుగున పెట్టిన భార్య ఉత్తరం కనిపించింది.

"ఏం మనిషో...ఊరికి వెళ్ళిన పదిరోజులకి ఉత్తరం రాస్తుంది. అసలు మొగుడనే వాడు ఒకడు ఈ దిక్కుమాలిన ఊళ్ళో, మరీ దిక్కుమాలిన ఈ ఆఫీసులో గాడిద చాకిరీ చేస్తూ తన ఉత్తరం కోసం ఆందోళన పడిపోతాడన్న ఇంగితంకూడా లేదు' అని మనసులోనే గొణుక్కొంటూ కవర్ని చించి చదవనారంభించాడు శంకరరావు.

"ప్రియమైన శ్రీవారికి"

అని చదివి - 'ఛ..ఈ మనిషికి బుద్ధిలేదు. సంబోధన తర్వాత 'సబ్జెక్టు' అని రాసి అందులో ఉత్తరంలోని విషయమంతా సంక్షిప్తంగా రాయొచ్చు కదా -మూడు ముక్కల్లో ..ఉత్తరం రాసే విధానమే తెలీదు. ఎప్పుడు నేర్చుకుంటుందో...' అనుకుని మళ్ళీ చదవడం మొదలుపెట్టాడు.

"ప్రేమతో ఆత్మీయతానురాగాలతో మీ శ్రీమతి ప్రమీలాదేవి రాయు ఉత్తరం...

ఈ రోజు నా ఉత్తరం చూసిందాకా మీకో పెళ్ళామున్నట్టూ, దానికిద్దరు పిల్లలున్నట్టూ - అది మీరాకకోసం ఎదురు చూసీ చూసీ కన్నుల్లో కాయలు కాయించుకుంటున్నట్లూ జ్ఞాపకముండదనుకుంటా... ఉండదు. ఉండదు గాక ఉండదు. ఎందుకుంటుందీ? పెళ్ళయిన ఈ ఐదేళ్ళలో నేను పుట్టింటికి వచ్చాక ఎప్పుడైనా పిలుచుకొని వెళ్ళారా? ఎప్పుడూ ఏవో కుంటిసాకులు చెప్పడమే - లీవులేదనీ, నెలాఖరనీ.. జమాబందనీ.. ఆఫీసు ఇన్‌స్పెక్షననీ, అదనీ, ఇదనీ... నిజంగా మనసంటూ వుంటే మార్గముండదా శ్రీవారూ!

ఏ ముచ్చటయినా ఎప్పుడు తీరింది గనుక - ఇంతెందుకూ ఏ రోజైనా జాలీగా అలా మీతో పాటూ బజార్లోకి, వాకింగ్‌కి వెళ్ళి ఎరుగుదునా! ఎప్పుడూ మీకు ఆఫీసు వర్కు తప్పితే మరొకటి పట్టదుకదా!

నాకు అపుడపుడు అనాలనిపిస్తుంటుంది.

"నన్ను మనిషిలా చూడకండి, చక్కటి 'అర్జెంటు ఫైలు' లా చూడండి చాలు" అని. వచ్చే జన్మంటూ వుంటే - ఆ జన్మలో కూడా మీరు గుమస్తాగా వుంటే, నేను ఫైలునై పుడతా...కాదు కాదు..శాశ్వత పెండింగ్ ఫైలునై పుడతా -

బోరు కొడుతోందా శ్రీవారూ!

ఏ ఉద్యోగయినా తన ఉద్యోగాన్ని ప్రేమించాల్సిందే - అది దేశ శ్రేయస్సుకు మంచిదే - అయితే మీరు ప్రేమించరు, కాపురం చేస్తారు - అక్కడే వస్తుంది చిక్కంతాను.

ఇవన్నీ హాస్యానికన్నవేలే - కోపగించుకోకండి.నా బెంగల్లా మీరు వేళకింత తింటున్నారో లేదోననీ, ఫైళ్ళని ఇంటికి తెచ్చుకుని రాత్రంతా నిద్రమానుకుని తృప్తిగా రాసుకుంటారేమోననీ.

మీకు ఉత్తరం రాస్తుంటే మా అన్నయ్య జోకేశాడు. మార్జిన్‌లో ఆకుపచ్చటి ఇంకుతో "అర్జంట్ పుటప్ టుడే" అని రాయమని.

అయినా నేనెందుకు రాయడం లేదు - ఎందుకో తెలుసా? అలా రాసిన వాటిని మరింత అశ్రద్ధ చేయడం సగటు గుమస్తాకు అలవాటని, సి.టి.ఓ. ఆఫీసులో పని చేస్తోన్న మాఫ్రెండు శాంతి చెప్పింది జ్ఞాపకానికొచ్చి మానుకున్నాను.

పాపా, బాబూ బావున్నారు. నాన్న కావాలంటూ ఉన్నాడు బాబు.

మీరు రాకపోతే మానె వెంటనే ఉత్తరమైనా రాయండి! రాయకపోయారో అక్కడికొచ్చాక 'మౌన పోరాటం' చేస్తాను - అంటే మాట్లాడకుండా సాధిస్తాను - అర్థమయిందా? ఉంటాను - మీ ఉత్తరం కోసం నిరీక్షిస్తూ...

మీ అర్ధాంగి ప్రమీల.

ఉత్తరాన్ని సాంతం చదివాక ఓ చిన్న నవ్వు నొకదాన్ని పెదాలతో వెలిగించాడు శంకరరావు.

'ఆఫీస్ ఇన్‌స్పెక్షన్ ఉన్నందువల్ల రాలేను' అని ఊరికెళ్ళేటప్పుడే ప్రమీలతో చెప్పాడు శంకరరావు. అయినా 'ప్రమీల ఎదురు చూస్తోందంటే...' శంకరరావు గుండెకు తడి అయింది. ఎంత ప్రేముంటే అలా ఎదురు చూస్తుంది.!

ప్రమీల ఉత్తరం చూసినప్పుడల్లా ఒకటనిపిస్తుంది - ఆమె ఎప్పటికయినా మంచి రచయిత్రి అవుతుందని - మనిషే వచ్చి ఎదురుగా కూచొని మాట్లాడుతున్నట్టు రాయడం ఎలా సాధ్యమవుతుందో - తనకయితే అర్థమే కాదు.

★ ★ ★

ఇంటికొచ్చాక జేబులో ఉత్తరాన్ని మరోమారు చదువుకుని తన భార్య ఉత్తరాల కలెక్షన్ ఫైల్లో పొందుపరిచాడు శంకరరావు.

ఆ రాత్రే ఉత్తరం రాసేయాలనిపిస్తోందతనికి, ఒకవేళ రాయకపోతే 'మౌనపోరాటం' చేస్తానన్న భార్య బెదిరింపు అదురు పుట్టిస్తోంది మరి.

తను పుట్టిబుద్ధెరిగిన నాటినుంచి ఏ ఐదారు సార్లో ఉత్తరాలు రాశాడు. అదయినా చదువుకొనే రోజుల్లో పరీక్షాపత్రాల్లోని ప్రశ్నలకి జవాబులుగా మాత్రమే. ఇక ఉద్యోగంలో చేరాక మాత్రం రోజుకో ఇరవై ఉత్తరాలు రాస్తున్నాడు. అవన్నీ అఫీషియల్ ఉత్తరాలాయె.

అయితే అవన్నీ వేరు -

పెళ్ళానికి ప్రేమలేఖ రాయడం వేరు -

ప్రేమలేఖని ఎలా రాయడం?

పెళ్లయిన ఈ ఐదేళ్ళలో రెండు పంక్తులున్న కార్డు ముక్కని ఒక్కసారైనా రాసి ఎరుగడాయె!

రాత్రి భోజనం చేసి వచ్చాక ఉత్తరం రాసే కార్యక్రమానికి పూనుకున్నాడు శంకరరావు.

'ప్రియమైన భార్యామణికి' అని ప్రారంభించి, ఆలోచనల్లో పడిపోయాడు. భార్యని ఏమని సంబోధిస్తారో....అసలూ 'భార్యామణి' అంటారో 'భార్యామాణిక్యం' అంటారో

లేక 'భార్యారత్నం' అంటారో, తెలీని సందిగ్ధంలో పడిపోయాడు కాసేపు - శంకరరావు.

సరేలెద్దూ 'మణి' అన్నదే ముద్దుగా వుంది అలానే వుండనీ - ఇంతకుమునుపు ఎవరూ వాడకుంటేనేం గాక తనే, వాడతాడంతే....! అనుకుని మళ్ళీ ప్రారంభించాడు. కానీ ఉత్తరం సాగేలేదు.

'ఉత్తరాల ఫైలు దగ్గరుంచుకొని రాయాల్సిందే లేకుంటే రాయడం ఎలా వీలవుతుంది?' అనుకుని చకచక అల్మారా దగ్గర కెళ్ళి ఫైలు తెచ్చుకుని పక్కనే ఉంచుకుని రాయబోయాడు.

అయినా సాగలేదు - తెలుగుకు ఏం తెగులొచ్చిందో కాని మంచి వాక్యాలు పడటం లేదు.

మామూలుగా శంకరరావు ఆఫీసులెటర్ ఏదయినా రాయాలనుకుంటే తెలుగులో ఆలోచించి ఇంగ్లీషులో రాస్తాడు.

ఈ మధ్య తెలుగు అధికారభాషా సంఘంవాళ్ళు తెలుగును కార్యాలయ భాషగా వాడి తీరాలన్న ఉత్తర్వులకు కట్టుబడి తెలుగులో ఆలోచించి ఇంగ్లీషులో రాసి మళ్ళీ దాన్ని తెలుగులోకి అనువదిస్తున్నాడు. ఇదీ అలా రాస్తేనో!..అబ్బ! బ్రహ్మాండమైన ఐడియా అనిపించింది శంకరరావుకి.

ఒక అర్ధగంట కల్లా ఇంగ్లీషులో రాయడం - తెలుగులోకి అనువదించడం పూర్తయింది. ఒక్కసారి ఉత్తరాన్ని మొత్తంగా చదివి తన ఆంగ్లాంధ్ర భాషా పాండిత్యానికి తనే మురిసిపోయాడు శంకరరావు.

మరుసటిరోజు ఉదయమే పోస్టు చేశాడా ఉత్తరాన్ని.

★ ★ ★

"అమ్మా ప్రమీలా! మీ ఆయనదగ్గర్నుంచి ఉత్తరమొచ్చిందే!" అంటున్న తల్లి కేకలు వినబడి దొడ్డివాకిట్లో చీర ఉతుకున్నదల్లా టక్కున లేచి సబ్బుచేతిని కొంగుకు తుడుచుకుంటూ వేగంగా వరండాలోకి వచ్చేసింది ప్రమీల. భర్త దగ్గరనుంచి ఉత్తరం రావడం నమ్మశక్యం కాకుండా వుందామెకు.

పట్టరాని ఆనందంతో, వణుకుతున్న చేత్తో అందుకుని ముసి ముసి నవ్వుల్ని పెదాల్లో బిగించి కవర్ని చించింది ప్రమీల. మెల్లగా కవరులోంచి ఉత్తరం తీసి చదవసాగింది.

ఎంత ఆనందంతో, ఉత్సాహంతో, చదవడం ప్రారంభించిందో అంత నీరుగారి పోయింది. ఆ ఉత్తరం రాసేపద్ధతీ అందులోని వాక్యాలూ, పదాలూ అలా వున్నాయి మరి. అసలు అందులో ఏం రాసి వుందో సరిగ్గా బోధపడటం లేదు ఆవిడకి.

రెండుసార్లు చదివింది.. ఉహూ!

మూడుసార్లు....ఉహూ!

నాలుగు సార్లు....ఊహుం

పన్నెండో సారి చదివింది...

ఏమీ అర్థం కాలేదు.

"ఏం రాశాడమ్మా అల్లుడు?" అడిగింది తల్లి.

"ఏమోనమ్మా.. అదే నాకూ అర్థం కావటంలేదు... ఏం రాశారో.. అసలెందుకిలా రాశారో ఏమిటో..." అంది అయోమయంగా ప్రమీల.

మొగుడు రాసిందాన్ని అర్థం చేసుకోలేకపోతే ఎలాగే పిచ్చిమొద్దూ!" అంటూ నవ్వుతూ ఇంట్లోకి వెళ్ళిపోయింది తల్లి.

'ప్రియమైన భార్యామణికి' అన్నదొక్కటే ఆ ఉత్తరంలో ఆమెకి స్పష్టంగా అర్థమవుతున్నది. తక్కిన దాంట్లో తను గర్భిణీ అయినందువల్ల జాగ్రత్తగా వుండమని సూచనలున్నాయి. తను ఇప్పుడు ఉట్టి మనిషని ఆయనకి మాత్రం తెలియదా? మరెందుకు అలా రాశారు చెప్మా! ఉన్నట్టుండి ప్రమీల తలలో అనుమానపు రేఖ తళుక్కుమని మెరిసింది.

కొంపదీసి ఆయనకి 'మణి' అనే మరో భార్య లేదు కదా! అలా అనుకుంటూనే ప్రమీల కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"అమ్మా! కొంప మునిగిందే..నా కొంప నిలువునా మునిగిపోయిందే..."

"ఏంటమ్మా...ఏమయిందే!" అంటూ వణుకుతున్న గొంతుతో ఉరుకుల పరుగులతో కంగారుగా వచ్చింది తల్లి.

"ఏమని చెప్పనే అమ్మా!...ఆయనకి ఎవరో 'మణి' అనే భార్య కూడా వున్నట్టుందే! అది ఇప్పుడు గర్భిణీ కూడా అయినట్టుంది. పొరపాటున నాకు ఈ ఉత్తరం పోస్టు చేసి, ఆ మణి' కి నాకు రాసిన ఉత్తరం పోస్టు చేసి ఉంటాడమ్మా... ఎంత పనయిందో చూడమ్మా!!" అంటూ ప్రమీల ఏడుపు కంఠంతో చెబుతూ వుంటే కూతుర్ని ఎలా ఓదార్చాలో తెలీక నిశ్చేష్టురాలై అలా శిలా ప్రతిమవలే చూస్తూ వుండిపోయింది వాళ్ళమ్మ.

అందాక వరండాలో ఆడుతున్న పిల్లలు తమ తల్లికేదో అపాయం జరిగినట్టు అనిపించి ప్రమీల దగ్గరికి చేరి ఏడుపు మొహాలు పెట్టారు.

"ఈ మగజాతిని నమ్మడానికి లేదే తల్లీ! అందుకేనే అమ్మా మొగుణ్ణి ఎప్పుడూ ఓ కంట కనిపెడుతూ ఉండాలి" అంది ప్రమీల తల్లి - పసిదాన్ని తన చంకలోకి వేసుకుంటూ.

"ఆఫీసులో ఆయన చాలా పనుందంటూ రాత్రి ఏ తొమ్మిదింటికో, పదింటికో ఇంటికి వస్తే నిజమేనేమో అన్ని ఫైళ్ళు రాస్తున్నారేమో అనుకున్నానే.....తీరా ఆయన నిర్వాకం ఇదన్న విషయాన్ని పసికట్టలేక పోయానమ్మా!" అంటూ రాగాలు తీసి ఏడుపు మొదలుపెట్టింది ప్రమీల.

★ ★ ★

సాయంత్రం ప్రమీల అన్నయ్య గురునాథం ఇంటికి రాగానే జరిగిన విషయమంతా చెప్పేశారు తల్లీకూతుళ్ళిద్దరూ.

ఉత్తరం తీసి చూపింది ప్రమీల -

గురునాథం ఓ గంటసేపు ఆ ఉత్తరంతో కుస్తీపట్టాడు. తర్వాత నడినెత్తిన గీరుకుని ఆలోచించాడు. చెంపల్నీ, గడ్డాన్నీ ఏకకాలంలో నొక్కుకుని మరీ ఆలోచించాడు. కింద పెదవిని ముందరిపళ్ళతో కాసేపు, వేళ్ళతో కాసేపు నలిపి, పిండి పిండి మరీ ఆలోచించాడు.

అప్పుడు అతని ముఖ కవళికల్లో మార్పు చోటు చేసుకుంది.

అతని పెదవులలో కదలికలొచ్చాయి.

ముందు అది ముసి ముసి నవ్వులయ్యాయి.

మరింత విచ్చుకొని చిరునవ్వులయ్యాయి. ఆ తర్వాత శబ్దతరంగాలతో గలగల నవ్వులయ్యాయి.

గురునాథం గలగల నవ్వును చూసి బాగా కోపం వచ్చేసింది ప్రమీలకు - "ఎందుకన్నయ్యా! అలా నవ్వుతావు? నా కాపురం బుగ్గిపాలయి పోతుంటేనూ!" అంది.

"నీ తలకాయ్! బుగ్గిపాలు లేదూ, గిగ్గిపాలు లేదు...పాడు ఆలోచనలతో నీ బుర్ర పాడు చేసుకోకు... సగటు ఎన్.జి.ఓ.కి ఇద్దరు భార్యల్ని చేసుకునే తీరికా, కోరిక కూడానా ప్రమీలా?!? చూడమ్మా! ఉత్తరం చదువుతాను....

"ప్రియమైన భార్యామణికి,

విషయం :

ఇల్లు - వాకిలీ - గర్భిణీ స్త్రీల సూచనలూ - నా ఆరోగ్యం - నీ క్షేమం

హోటలు భోజనం - నీ కొరకు

నిరీక్షణ - అందరి క్షేమాలు అడుగుట - గురించి.

నిర్దేశము : నీ ఉత్తరం నెంబరు :లేదు, తేది : లేదు

పైన కనబరచిన నిర్దేశము గమనించునది. మునుపు ఊరికి వెళ్ళెదనంటూ మారాము చేసి వెళ్ళిన తర్వాత తొందరగా వచ్చెదనని ఉత్తరమును రాసి రాకపోయితివి. ఇది నీకు తగదు. ఈమారు అటుల చేయకూడదు. అటుల చేసిన తదుపరి చర్య తీవ్రముగా నుండగలదని ఇందుమూలముగా నీకు తెల్పడమైనది. నేను ఆరోగ్యముగా నుంటిని. నీ ఆరోగ్యమును, క్షేమమును సదా నేను కోరువాడను.

నీవు గర్భిణీ స్త్రీవి గనుక, ఇప్పుడు నవమాసములు నిండుచున్నవి గనుక బహు జాగ్రత్త వహించమని నిన్ను కోరడమైనది. ఎక్కువ బరువును మోయవలదు. ప్రతిదినము సాయంత్రం వాహ్యాళికి వెళ్ళి రమ్మని ఎన్నిమార్లో చెప్పియుంటిని. అది నీకు గుర్తు వుండే వుండును. అయినను మరొక్కమారు తెలిపెదను.

ప్రస్తుతము నేను హోటలు ఆహారమునే భుజించుచున్నవాడను. అందులకే నీ

ప్రస్తుతము నేను హోటలు ఆహారమునే భుజించుచున్నవాడను. అందులకే నీ కొరకు సదా నిరీక్షించుచుంటిని. అయినను ఏమి లాభము? నీవు పురుడు పోసుకొను వరకూ రావుగదా! కానిమ్ము....పురుడు పోసుకొనగానే లేఖ వ్రాయునది. అందరి క్షేమములు కాంక్షించువాడను.

ఇట్లు నీ విశ్వాసపాత్రుడు

నీ పతి

శంకరరావు"

"చూశావా ప్రమీలా! బావగారు అక్షరాలా నీకు రాసిన ప్రేమలేఖే నమ్మా ఇది"

"అదెలాగన్నయ్యా! నేనే గర్భవతినా?" అడిగింది ప్రమీల.

"ఆవేశపడకమ్మా నిదానంగా అర్థం చేసుకో ఈ ఉత్తరాన్ని...నేనూ ఓ సగటు గుమస్తాగాణ్ణే కాబట్టి మీవారి పరిస్థితినీ, ఈ లేఖనీ అర్థం చేసుకున్నా... మొన్న నువ్వు బావగారికి రాసిన ఉత్తరం చదువుతూనే - తప్పకుండా ఈసారి ఉత్తరం రాసి తీరాలన్న సత్సంకల్పంతోనూ, ఉబలాటంతోనూ ఈ ఉత్తరం రాశాడు పాపం! అయితే గుమస్తాకు సుగుణం ఒకటుందమ్మా... అదేమిటంటే...ఏరోజు వచ్చిన ఉత్తరానికి ఆ రోజు జవాబు రాయకపోవడం...అందువలన...

ఇన్నేళ్ళ ఉద్యోగపుటలవాటుతో ఇంతకుమునుపు నువ్వు రాసిన ఉత్తరానికి - అంటే.. నువ్వు గర్భిణీగా ఉన్నప్పుడు రాసిన ఉత్తరానికి సమాధానం ఇప్పుడు రాశాడన్న మాట. మరి ఆ లెక్కన మొన్న నువ్వు రాసిన ఉత్తరానికి జవాబు ఎన్నేళ్ళకొస్తుందో ఊహించుకోమ్మా! ఊహించుకో!"

అంటూ నవ్వుతోన్న గురునాథాన్ని చూసి -

"అమ్మయ్యా! బతికించావన్నయ్యా.... పాపం బంగారం లాంటి వారిమీద..." అంటూ సిగ్గుపడిపోయింది ప్రమీల.

(విపుల - మార్చి, 1989)